# బింబం - ప్రతిబింబం

రాత్రి ఎనిమిది గంటలవుతోంది.

అప్పుడే ఆఫీసు నుండి ఇంటికొచ్చిన విద్యాసాగర్ విసుగ్గా చేతిలో ఉన్న ల్యాప్‌ట్యాప్‌ను సోఫామీద పడేసి దీర్ఘంగా నిట్టూర్చాడు. సుమిత్ర లోపలెక్కడో యే టీవీ సీరియల్‌నో చూస్తూ తను వచ్చినట్టు గమనించి ఉండదు. తను ఇంటికొచ్చినట్టు ఆవిడగారు గమనిస్తే మాత్రం ఒరిగేదేముంది. "బాగా అలసిపోయి వచ్చినట్టున్నారు... రెస్ట్ తీసుకొండి" అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ ఓ రుచికరమైన కాఫీకప్పు చేతికిస్తుందా? ఇంటికొచ్చింది మొదలు మళ్ళీ బయటకెళ్ళేంత వరకు ఆవిడగారు ఈటెల్లాంటి సూటిపోటి మాటలతో తనను గాయపరచటానికి ప్రయత్నిస్తూనే ఉంటుంది. తనది అరేంజ్డ్ మ్యారేజి. తన అమ్మానాన్నలే ఓ మధ్యవర్తి ద్వారా ఈ సంబంధాన్ని గూర్చి తెలుసుకున్నారు. చాలా మంచి కుటుంబం అన్నారు. అమ్మాయి వాళ్ళ అమ్మ ఈ అమ్మాయికి ఐదారేళ్ళున్నప్పుడే చనిపోయిందట. వాళ్ళ నాన్న మళ్ళీ పెళ్ళిచేసుకున్నాడట. సవతితల్లి చేతిలో ఆ అమ్మాయి చాలా కష్టాలు అనుభవించిందట. వాళ్ళ నాన్న ఆర్డీవోగా పనిచేస్తూ బాగానే సంపాదించాట. ఆ కుటుంబ సభ్యులందరూ చదువూ, సంస్కారం ఉన్నవాళ్ళని చెప్పారు. తనను అమ్మాయిని చూడటానికి రమ్మని కబురు చేస్తే అమ్మ, నాన్న, అక్కయ్యలతో కలిసి వెళ్ళి చూశాడు. సుమిత్ర చూడటానికి బాగానే ఉంది. ఎం.ఏ చదివిందనీ, చాలా తెలివైందనీ, కలుపుగోలు మనిషని, ఈమే నీకు అన్నివిధాలా తగిన భార్య అనీ మధ్యవర్తి చెప్పాడు. అమ్మానాన్నలు కూడా అతని మాట నిజమే అన్నారు. తనో పెద్ద మల్టీనేషనల్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నానని తెలిసినప్పట్నించి సుమిత్ర తల్లిదండ్రులు ఈ సంబంధం కుదిరితే బావుండునని కలలుగనటం మొదలెట్టారు. సుమిత్రను చేసుకోను అనటానికి తనకే కారణమూ కనిపించలేదు. పెళ్ళయ్యాక రెండు మూడు నెలల వరకు సుమిత్రను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాడు. ఆమె చాలా రిజర్వ్‌డ్ మనిషనిపించింది. చాలా మితభాషిణి. యేదీ స్పష్టంగా చెప్పేది కాదు. కొత్తగా పెళ్ళయ్యింది కాబట్టి అలా రిజర్వ్‌డ్‌గా ఉంటోందేమో... కొద్దిరోజులు పోతే ఫ్రీగా మాట్లాడుతుందిలే అనుకున్నాడు. కానీ అలాంటిదేమీ జరగలేదు. ఎప్పుడూ ఆమె ప్రపంచంలో ఆమె ఉండిపోతుందే తప్ప తన ప్రపంచంలోకి రాదు. తనను అర్థం చేసుకోవటానికి ప్రయత్నించదు. ఆమెను అర్థం చేసుకోవటానికి తనకు అవకాశం ఇవ్వదు. ఈమధ్య

ఆమెకు తనమీద లేనిపోని అనుమానాలు కల్గుతున్నాయి. ఆమెలో జనిస్తున్న ఆ అనుమానాల్ని ఎలా పోగొట్టాలో తనకర్థం కావడం లేదు.

"యేదో దీర్ఘంగా ఆలోచిస్తున్నట్టున్నారే?" నిశ్శబ్దంగా ఉన్న ఆ గదిలో అకస్మాత్తుగా ఈ మాటలు వినిపించేటప్పటికి అతడు ఉలిక్కిపడి ఆమెవైపు చూశాడు. చేతిలో కాఫీ కప్పు పట్టుకొని సుమిత్ర అతనివైపే చూస్తోంది.

"అబ్బే! ఏంలేదు" అన్నాడతడు ఆమె చేతిలో ఉన్న కాఫీ కప్పును తన చేతిలోకి తీసుకుంటూ.

"మీరేదో ఆలోచిస్తున్నారు..."

"ఏమీలేదని చెప్పానుగా..."

"నాతో చెప్పకూడనిదేమో"

"నీతో చెప్పకూడనిదంటూ ఏమీలేదు"

"ఏమీలేనిదే ఎందుకలా సీరియస్‌గా ఒక్కరే డ్రాయింగ్ రూంలో కూర్చొని ఆలోచిస్తున్నారు? 'సుమిత్రా! కాఫీ తీసుకురా!' అని నన్ను పిలవొచ్చుగా"

"పిలుద్దామనే అనుకుంటున్నాను. ఈలోగా నువ్వు వచ్చేశావు" అన్నాడతడు నవ్వడానికి ప్రయత్నిస్తూ.

"మీరొచ్చి అరగంటయ్యింది. ఇంకెప్పుడు పిలుద్దామనుకుంటున్నారు"

"నువ్వు నిద్రపోతున్నావనుకున్నాను... డిస్టర్బ్ చెయ్యడం ఎందుకని?..."

"కాదు... మీరేదో సీరియస్‌గా ఆలోచిస్తూ నేనొకదాన్ని ఇంట్లో ఉన్నానన్న సంగతే మరచిపోయారులెండి"

"యేమీలేదని ఎన్నిసార్లు చెప్పినా నమ్మవా?" అతని మాట వినిపించు కోకుండానే

"మీరేం ఆలోచిస్తున్నారో నాకు తెలుసులెండి"

"తెలిస్తే అడగటం దేనికి?"

"అడక్కూడదా? అడక్కూడదు... అడిగే హక్కు నీకు లేదంటే అడగనులెండి"

"అర్ధాంగివి... అడిగే హక్కు నీకుగాక ఇంకెవరికుంటుంది"

"నాకెందుకుంటుంది లెండి... మీకు చాలా దగ్గరగా ఉండేవాళ్ళకెవళ్ళకో ఉంటుంది గానీ... అదోలా ఉంటే యేం ఆలోచిస్తున్నారని అడగటం కూడా తప్పేనన్నమాట"

"తప్పని ఎవరన్నారు? ఎందుకలా నీకు నువ్వే అనని మాటని సృష్టించు కుంటావు? లేనివి సృష్టించుకోవటంలో మీ ఆడవాళ్ళను మించినవాళ్ళు ఈ ప్రపంచంలో ఎవరూ ఉండరనుకుంటాను"

"అవునవును... ఆడవాళ్ళను గూర్చి మీకు తెలిసినంతగా ఎవరికీ తెలీదనుకుంటాను. కట్టుకున్న ఒక్కదానికే కట్టుబడి ఉండాలన్న నీతినియమాలు మీకుంటే కదా..."

"సుమిత్రా! ఇంట్లో అడుగుపెట్టానో లేదో... మళ్ళీ మొదలైందీ నీ సాధింపు..."

"ఉన్నమాటంటే సాధింపు... ఎంతమంది ఆడవాళ్ళతో తిరక్కపోతే మీకు ఆడవాళ్ళ మనస్తత్వం ఇంత చక్కగా అర్థమవుతుందో...?"

"చాలా క్యాజువల్‌గా అన్న ఒక్కమాటకు ఇంత అర్థం లాగే నీ ఊహాశక్తిని అభినందించాలి"

"ఆహా! ఎంత దయ కల్గిందీ దీనురాలిమీద!"

"నీ నిష్ఠూరపు మాటలతో గాయపరచకుండా నీకు నానుండి యేం కావాలో స్పష్టంగా చెప్పు. నాకు సాధ్యమైతే తప్పకుండా ఇస్తాను"

"నాకివ్వడానికి మీకు ఏదీ సాధ్యం కాదులెండి. అడిగేవాళ్ళు అడిగితే అన్నీ సాధ్యమౌతాయి"

"ఎవరా అడిగేవాళ్ళు?"

"మీకు తెలియనే తెలీదా?"

"నిజంగా తెలీదు"

"పాపం! పిల్లి కళ్ళుమూసుకొని పాలు తాగుతూ తననెవరూ చూడటం లేదనుకుంటుందట... తను కళ్ళు మూసుకున్నాను కాబట్టి అందరూ కళ్ళు మూసుకుంటారనుకుంటుందట"

"ఈ డొంకతిరుగుళ్ళూ, ఈ వెటకారాలు మానేసి అసలు విషయమేమిటో చెప్పు... యేదో మనసులో పెట్టుకొని ప్రతిరోజూ నీ సాధింపులతో, నిష్ఠూరాలతో రాచి రంపాన పెడ్తున్నావు. ఈరోజు అసలు సంగతి బయటపడాలి. చెప్పు, ఎవరా 'అడిగేవాళ్ళు'?"

"ఎందుకండీ, అంత అమాయకుల్లా నటిస్తారు... నటనక్కూడా ఒక హద్దుండాలి?"

"సుమిత్రా... నాకు పిచ్చెత్తించకు... కొంతకాలంగా నీ మనసులో మసల్తున్న ఆ అనుమానపు అగ్ని నిన్నూ, నన్నూ దహించివేస్తున్నది. ఈరోజవి బయటకు రావాలి. నిజానిజాలు తెలియాలి"

"బయటకు రావడం ఎందుకులెండి... వాటిని నా మనస్సులోనే ఉండనీయండి. ఆ అగ్ని నా మనసులోనే రాజుకొని నన్నే కాల్చేయనీయండి. ఆతర్వాత

మీకిష్టమైన దాన్ని చేసుకొని..." ఆమె కంఠం రుద్ధమైపోయింది. తన్నుకొని వస్తున్న దుఃఖాన్ని ఆమె బలవంతంగా ఆపుకోవటానికి ప్రయత్నించింది.

"అబ్బబ్బబ్బ... యేమన్నా అంటే ఈ యేడుపొకటి... మనలో మెదుల్తున్న అనుమానాల్ని మనలోనే ఉంచుకుంటే అవి రోజురోజుకు పెరిగిపోతూ వెర్రితలలు వేసి మనకు శాంతి, సౌఖ్యాలు లేకుండా మనల్ని నాశనం చేస్తాయి. ఆ అనుమానాల్ని బయటపెట్టి వాటిలోని నిజానిజాల్ని పరీక్షించాలి. అలా కాకుండా ఆ అనుమానాల్ని నిజమని నీ అంతట నువ్వే ధ్రువపరచుకొని అవి సృష్టించే విషయవలయంలో కూరుకుపోవడం అన్యాయం... ఘోరాతిఘోరం..."

"ఔనండీ! నేను చేసే పనులన్నీ అన్యాయాలే... ఘోరాతి ఘోరాలే... నేనసలు మనిషినే కాదు. పిశాచాన్ని. భూతాన్ని... రాక్షసిని... మిమ్మల్ని పట్టి పీడించటానికే మీ జీవితంలోకొచ్చాను. ఒక్కసారే ఈ పాపిష్టిదాని గొంతు పిసికేసి నాపీడను వదిలించుకోండి.... ఊ... రండి. నా గొంతు పిసికెయ్యండి" అంటూ ఆమె అతని దగ్గరకొచ్చి "నా గొంతు పిసికెయ్యండి" అన్నట్టుగా అతనికేసి చూసింది.

ఆమె గొంతులో ధ్వనించిన కసి, ఆవేశం, ద్వేషం, ఉక్రోషం అతన్ని అప్రతిభుణ్ణి చేశాయి.

ఆ కసి, ద్వేషం, ఉక్రోషం ఆమెమీద ఆమెకేనా? లేక తనమీదనా? అతడు తేల్చుకోలేకపోయాడు. ఆమెకు ఆమె మీదనే యేదో తీవ్రమైన కసి, ద్వేషం ఉన్నాయేమో అనిపిస్తుంది... ఆమెలోనే నిగూఢంగా ఉన్న ఆమె శత్రువును గుర్తించలేక బయటెవరో శత్రువులున్నారనుకుంటూ ఇలా ప్రవర్తిస్తున్నదేమో... అనుకున్నాడతడు. ఆమెలా తనూ ఆవేశానికీ, ఆగ్రహానికీ లోనుకాకూడదు.

"ఊరుకో సుమిత్రా... ఎందుకంత ఆవేశం... నేనిప్పుడు నిన్ను యేమన్నానని..."

విద్యాసాగర్ అలా అంటుండగానే 'ఠంగ్'మని వాళ్ళింటి కాలింగ్‌బెల్ మోగింది.

"ఎవరో వచ్చినట్టుంది" అంటూ సాగర్ వెళ్ళి తలుపులు తెరిచాడు.

"హల్లో రవీందర్ గారూ... సినిమాకెళ్ళొస్తున్నారా?" అన్నాడు సాగర్.

"నమస్కారం సాగర్ గారు... సినిమాకే వెళ్ళొస్తున్నాము. వెళ్ళేటప్పుడు మా బంధువు ఒకామె వస్తుందనుకొని మీ ఇంట్లో మా పోర్షన్ కీస్ ఇచ్చి వెళ్ళాం" అన్నాడు రవీందర్.

"అలాగా!" అని సాగర్ అంటుండగానే సుమిత్ర వెళ్ళి రవీందర్ వాళ్ళింటి తాళపుచెవుల్ని తెచ్చి రవీందర్‌కిచ్చింది.

"మీ బంధువులెవరూ రాలేదండి" అంది సుమిత్ర.

"అవునండీ... ఆమె ఈ ఊరికొచ్చింది గానీ మా ఇంటికి రాలేదు లెండి. మేం సినిమాకెళ్తున్నామని, పక్కింట్లో కీస్ ఇచ్చి వెళ్తున్నామని మేం ఫోన్‌చేసి చెప్పాం. మీరు లేకుండా నేనెందుకు మీ ఇంటికి రావడం అని ఆమె ఈ ఊర్లోనే ఉంటున్న మా ఇంకొక బంధువుల ఇంటికి వెళ్తున్నానని చెప్పింది" అన్నాడు రవీందర్.

"మీరు సినిమాలు బాగా చూసేట్టున్నారే" అన్నాడు సాగర్.

"ఔనండీ! మా నీరజకు ప్రతిరోజూ ఒక సినిమా చూపించందే బతుకనివ్వదు" అన్నాడు రవీందర్, అందంగా సిగ్గుపడుతున్న అతని భార్య నీరజవైపు ఆరాధనగా చూస్తూ.

"అన్నీ అబద్ధాలు సార్! ఈరోజు ఆయనే నన్ను బలవంతంగా సినిమాకు తీసికెళ్ళాడు" అంది నీరజ.

"ఆవిడదే అబద్ధం సార్! ప్రతిరోజూ సినిమాకో, పార్క్‌కో, హోటల్‌కో, షాపింగ్‌కో తీసికెళ్ళకపోతే రాణిగారు మూతి ముడిచేస్తారని మా పెళ్ళయిన ఈ మూడు నెలల్లో గ్రహించి - రాణిగారు అడక్కపోయినా ఎక్కడికో ఒక చోటికి తీసికెళ్ళాలని నిర్ణయించుకున్నాను. భార్యామణులకు కోపం తెప్పిస్తే మనం ప్రశాంతంగా బతకగలమా చెప్పండి?" అన్నాడు రవీందర్.

"ఎందుకులెండి కోతలు... ఇలా ఇంటి బయట నిల్చొని... లోపలికి పదండి" అంది నీరజ.

"చిత్తం దేవీ! నీ అడుగుజాడల్లో నడిచి నీ నీడలో మేడలు కట్టడం కంటే నా జీవిత పరమార్థం మరేముంటుంది" అన్నాడు రవీందర్ తాళం తీస్తూ.

"అబ్బబ్బ... కాస్సేపు నోరుమూద్దురు" అంది నీరజ.

ఇద్దరూ నవ్వుకుంటూ వాళ్ళింటి తలుపులు తెరచుకొని లోపలికి వెళ్ళి తలుపులు మూసేశారు.

వాళ్ళుంటున్న పోర్షన్ కూడా విద్యాసాగర్ ఇటీవలనే నిర్మించిన ఇంటిలోని ఒక భాగమే. ఒక ఇంటినే రెండు పోర్షన్లు చేసి ఒక దానిలో తనుంటూ, మరోదాన్ని రవీందర్ దంపతులకు అద్దెకిచ్చాడు.

"వాళ్ళిద్దర్నీ చూస్తే చాలా ముచ్చటేస్తుంది" అన్నాడు సాగర్ సుమిత్రకేసి మనమూ అలా ఉండొచ్చు కదా అన్నట్టుగా చూస్తూ.

"ఎందుకో అంత ముచ్చటేయడం?" అంది సుమిత్ర.

"చూడముచ్చటైన జంట... కొత్తగా కాపురం పెట్టారు. ఎప్పుడూ కిలకిలా నవ్వుతూ ప్రపంచమంతా తమదే అన్నట్టుగా హాయిగా ఉండే వాళ్ళను చూస్తే..."

"మీరు యేయే సుమధుర లోకాల్లోనో విహరిస్తారు కదూ? ఇంత రాత్రి ఎక్కడికెళ్ళొస్తున్నారో వాళ్ళు?"

"సినిమా కెళ్ళొస్తున్నామని చెప్పారుగా..."

"నన్ను ఒక్కసారైనా అలా సినిమాకు తీసికెళ్ళారా? అయినా నేను మీ పక్కన మీ ఫ్రెండ్స్‌కూ, మీ ఆఫీసువాళ్ళకు కనిపించటం మీకిష్టముండదు కదా... నన్ను మీరు సినిమాకెందుకు తీసికెళ్తారు లెండి"

"ఎందుకు సుమిత్రా, నన్ను నీ ప్రతి మాటతో గాయపరిచే ప్రయత్నం చేస్తావు... నిన్నెప్పుడూ సినిమాకు తీసికెళ్ళలేదా? సినిమాకు వెళ్దామంటే నువ్వే అసలు బయిల్దేరవు గదా! ఎందుకండీ ఆ పిచ్చి సినిమాలు... ప్రేమించుకోవడాలు... కౌగలించుకోవడాలు లాంటి వెకిలి చేష్టలు తప్ప సినిమాల్లో యేముంటాయని నువ్వే అంటావుకదా... పోనీయ్ ఇప్పుడు వెళ్దామా... సెకండ్‌షోకి..."

"ఎందుకులెండి, తెచ్చిపెట్టుకున్న ఉత్సాహంతో నా కళ్ళనీళ్ళు తుడిచే ప్రయత్నం చేస్తారు"

"తెచ్చిపెట్టుకున్న ఉత్సాహమా?..."

ఎంతో బాధ ధ్వనించింది అతని కంఠంలో

"ఎంత హాయి ఈరేయి... ఎంత మధురమీహాయి" పక్కపోర్షన్లోంచి రవీందర్ హుషారుగా పాడుతున్నపాట.

"మైడియర్ నీరూ! పిక్చరెలా ఉందంటావు?" పాట ఆపేసి అడుగుతున్న రవీందర్. సాగర్, సుమిత్ర మాట్లాడుకోవడం మానేసి రవీందర్-నీరజల మాటలు వినసాగారు.

"ఎన్నిసార్లు చెప్పానండీ మీకూ, నీరూ పారూ అంటూ నా పేరును పాడుచెయ్యొండంటూ... ఛీ! మీతో అస్సలు మాట్లాడను" అంటున్న నీరజ.

"అమ్మబాబోయ్! కోపమే... అదిగో ఆ మూతి గులాబీ పువ్వులా ముడుచుకుపోతోంది. పున్నమి వెన్నెల్లో విరిసిన కలువల్లాంటి ఆ కన్నుల్లో అప్పుడే ఏమిటా వేడి, వాడి... కోపంలో కూడా నీ ముఖం గ్రీష్మరుతువులో మోదుగుపూవులా ఎంత మనోహరంగా వెలిగిపోతున్నది నీరూ... సారీ... నీరజా..." అంటున్నాడు రవీందర్.

"బాబూ!... ఈ కవిత్వం కాస్సేపు ఆపేద్దురూ. నాకు సిగ్గేస్తుంది" అంటోంది నీరజ.

"నువ్వలా సిగ్గుపడ్తోంటే ఇంకెంత అందంగా ఉన్నావో తెలుసా? అప్పుడే వికసించిన ముద్దమందారంలా... సంధ్యాసమయంలో ఎర్రగా కందిన పడమటి ఆకాశంలా..." అంటున్నాడు రవీందర్.

"మీ కవిత్వంతో నన్ను ఊపిరి తీసుకోనివ్వడం లేదు బాబూ... కాస్త ఊరుకోండి" అంటోంది నీరజ కిలకిలా నవ్వుతూ.

"ఎలా ఊరుకోను? ఎంత వర్ణించినా తరగని గని నీ అందం... నాకొక తీరని దాహం నీ అలౌకిక సౌందర్యం... పోనీయ్‌లే... ఇంతకూ సినిమా... సినిమా ఎలా ఉందంటావు"

"యేం సినిమా అది?"

"తెలుగు సినిమాయేనండి"

"నామొహంలా ఉంది"

"ఎంతమాట జారావు నీరూ... సారీ నీరజా! ఆ డర్టీ సినిమా నీ మొహంలా ఉండటమా? సృష్టిలోని సౌందర్యాన్నంతా మూర్తీభవించుకున్న నీ మొఖంతో ఆ అగ్లీ అండ్ ఆక్వర్డు సినిమాను పోలుస్తావా? అపచారం. తీరని అపచారం"

"చాల్లెండి... మళ్ళీ మొదలెట్టారు మీ కవిత్వాన్ని... వెనకజన్మలో మీరో కవై ఉంటారు... ఏమిటలా తినేసేలా చూస్తున్నారు... ఇందాకటి సినిమాలో వంటిమీద బట్టల్లేని ఆ హీరోయిన్ను హీరోగారు చూసినట్టు యేమిటా చూపులు... మీరలా చూస్తోంటే నాకొకటి గుర్తొస్తోంది. నేను కాలేజీలో చదువుకునే రోజుల్లో కొత్తగా అప్పుడే ఎం.ఏ. ప్యాసై వచ్చిన ఓ లెక్చరర్ నాకేసి ఇలాగే చూసేవాడు... అతన్ని చూసినప్పుడల్లా అతడు నన్ను ప్రేమించేస్తున్నాడేమోనని అనుకునేదాన్ని"

"ఎవడా లెక్చరర్? ఏమాకథ? వాడెవ్వడో, వాని ఊరేమిటో, పేరేమిటో చెప్పు... వాడీ ముల్లోకాల్లో ఎక్కడున్నా సరే, వెతికి, పట్టితెచ్చి, వాడి డొక్కచించి, డోలుకట్టి... అహ్హహ్హహ్హా"

"ఏమిటా నవ్వు, ఇందాకటి సినిమాలో విలన్ నవ్వినట్టుగా... ఆ విలన్‌గాడు హీరో కంటె బావున్నాడు... వాడి కండలు, వాడి ఎక్కుపెట్టిన మీసాలు - ఆశ్చర్యం... వాడి మీసాలూ, మీ మీసాలు ఒకలాగే ఉన్నాయి... మీరు సినిమాల్లో ట్రైచెయ్యకూడదూ... విలన్ వేషాలకు బాగా పనికొస్తారు" అంటూ కిలకిలా నవ్వుతున్న నీరజ.

"నేను విలన్ వేషాలు వెయ్యటమా? దిస్ రవీందర్ దిగ్రేట్... విలన్ వేషాలు వెయ్యటమా? నా ఈ ఎక్కుపెట్టిన మీసాలంటే మీ ఆడవాళ్ళు పడిచస్తారని నీకు తెలియదా నీరూ... సారీ నీరజా... మొన్ననే మా ఆఫీసుకు నీలాంటి ఓ కోమలాంగి వచ్చి సంపంగి నూనెతో ఘుమఘుమలాడ్తున్న నా మీసాల్ని చూసి సంభ్రమాశ్చర్యాలతో మూర్ఛపడిపోతూ "మీకోసమే ఇంతకాలంగా అన్వేషిస్తున్నాను... నన్ను మీ చరణదాసిగా స్వీకరించండి స్వామీ!" అంటూ నా పాదాలమీద పడిపోయింది తెలుసా భామా!"

"తెలుసు గానీ ఇక ఆపండి. లేకపోతే ఇప్పుడు నాకొస్తుంది మూర్ఛ. సరేగానీ, ఇక వడ్డిస్తాను పదండి..."

"యేం వడ్డిస్తావు నీరూ?... అన్నపానీయాలు మాత్రమేనా?"

"ఇంకేం కావాలట?"

"నీ అందాన్ని, నీ యౌవనాన్ని కూడా వడ్డించాలి నీరూ... ఈ ఆకలికంటె ఆ ఆకలే ఎక్కువ నాకు..."

"ఔను పాపం... ఆ ఆకలే ఎక్కువ"

వాళ్ళిద్దరు గలగలా నవ్వుకుంటూ వంటింట్లోకి వెళ్తున్నారని సాగర్‌కూ, సుమిత్రకూ అర్థమైంది.

"కొత్తగా కాపురం పెట్టిన ఈ దంపతుల్లోని ఈ అన్యోన్యత, ఈ ఆనందం, ఈ ఆకర్షణ కొంతకాలం గడిచాక ఎలా మారుతుందో ఊహిస్తే భయమేస్తున్నది" తనతో తను మాట్లాడుకుంటున్నట్టుగా అన్నాడు విద్యాసాగర్.

"మీకెందుకో అంత భయం?" అంది సుమిత్ర.

"ఊరికేనే అన్నానులే... ఎందుకంత సీరియస్‌గా తీసుకుంటావు?" అన్నాడు సాగర్.

"ఊరికేనే ఎందుకంటార్లెండి. ఏదో అంతరార్థం ఉంటేనే అంటారు" అంది సుమిత్ర.

"యేమిటో ఆ అంతరార్థం... నువ్వే చెప్పు"

"మీ అంతరార్థాలు, మీ రహస్యాలూ నాకెలా తెలుస్తాయి?"

"రహస్యాలా? నీకు తెలియని రహస్యాలు నాకేమున్నాయి?"

"చాలా ఉన్నాయిలెండి"

"మళ్ళీ మొదలైందా నీ సణుగుడు... ఒక్కక్షణం నాకు మనశ్శాంతి లేకుండా నీ మొండిసాధింపులతో నా ప్రాణాల్ని తోడేస్తున్నావు? నువ్వసలు మనిషివికావు...

ఏదో భయంకర పిశాచం నిన్ను ఆక్రమించుకుంది" అతడు పూర్తిగా సహనాన్ని కోల్పోయాడు.

"ఔను... ఔను.. నన్ను పిశాచమే పట్టుకుంది. మీరు చేస్తున్న పనుల్ని చూస్తేఆత్మాభిమానాలున్న యే ఆడదాన్నైనా పిశాచమే పట్టుకుంటుంది" అందామె కసిగా... ఆమెలోని అణువణువును రోషం, కసి, దెబ్బతిన్న అహం ఆక్రమించుకున్నాయి.

"నేను చేసిన అంత నీచమైన పనులేమిటో చెప్పకపోతే నేనేం చేస్తానో నాకు తెలియదు. చెప్పు... ఇప్పుడే ఇక్కడే... వెంటనే చెప్పు... కమాన్... ఓపెన్ యువర్ మౌత్ అండ్ టాక్..." అన్నాడతడు అదుపులేని ఆవేశంతో.

"చెప్తాను... ఇన్నాళ్ళుగా అనుభవిస్తున్న నా మూగబాధను చెప్తాను. అగ్నిసాక్షిగా, వందలమంది సముఖంలో కట్టుకున్న భార్యను ఇంట్లో నాలుగ్గోడల మధ్య పాతేసి కంటికింపుగా కనిపించిన ఆడదానితోనల్లా షికార్లు కొట్టడం నీచమైన పనికాదా? బయటంతా హాయిగా గడిపేసి ఇంట్లో అడుగుపెట్టగానే ఏదో జైల్లో అడుగుపెట్టినట్టుగా బాధగా మొఖం పెట్టి సీరియస్‌గా ఆలోచిస్తూ... నన్ను చూడగానే పగున్నదాన్ని చూసినట్టుగా మొఖం చిట్లించటం... ప్రేమగా, శాంతంగా ఒక్కమాటైనా మాట్లాడకపోవడం... ఎప్పుడూ మీ ప్రేయసీమణుల్నే గుర్తుచేసుకుంటూ కలల్లోకి వెళ్ళిపోవడం నీచమైన పనికాదా?"

"ఎంత మూర్ఖంగా, ఎంత అసహ్యంగా మాట్లాడుతున్నావు సుమిత్రా! కంటికింపుగా కనిపించిన ఆడదానితోనల్లా నేను షికార్లు కొడుతున్నానా? నీ మూర్ఖపు అనుమానాలకు ఆధారాలేమిటి? కనీసం ఒక్క ఆధారాన్ని చూపించు..."

"ఒక్కటికాదు... వెయ్యి ఆధారాల్ని చూపిస్తాను. మన పక్కపోర్షన్‌లో ఉండే ఆ నీరజ అనే అమ్మాయికేసి మీరెన్నిసార్లు దొంగచాటుగా చూస్తున్నారో నేను గమనించడం లేదనుకుంటున్నారా? ఎర్రగా, బుర్రగా ఉండే మన పనిమనిషి బాలమ్మతో "బాలా! బాలా!" అంటూ సరసాలాడటం నేను చూడటం లేదనుకుంటున్నరా? మీ ఆఫీసులో మీకు పి.ఎ.గా పనిచేస్తున్న సునీతతో మీరు క్లబ్బులకూ, హోటళ్ళకూ, సినిమాలకు వెళ్తుంటారని లోకమంతా కోడైకూస్తున్నది... ఇంకా... ఇంకా కావాలా ఆధారాలు... మనింటికి కూరగాయలు తెచ్చే కౌసల్యకు మీరు చాటుమాటుగా డబ్బులిస్తుండటం కూడా నేను చూశాను"

"మైగాడ్! కొంతకాలంగా నామీద నీకు యేవో కొన్ని అస్పష్టమైన నీకే అర్థంగాని కేవలం నువ్వు ఊహించుకుంటున్న అనుమానాలున్నాయని అనుకున్నానుగానీ నువ్వింతగా దిగజారిపోయి ఇంత నీచమైన ఆరోపణలు చేస్తావని

కలలో కూడా ఊహించలేదు... పక్కింటి నీరజతో కూడా నాకు సంబంధం అంటగట్టావా? ఆ అమ్మాయి నాకు చెల్లెలులాంటిది... పనిమనిషి బాలమ్మతోనా? 'బాలా! బాలా!' అని పిలిచినందుకా... కూరగాయలు తెచ్చే కౌసల్యతోనా? ఛీఛీఛీ! నీ మాటలు వింటోంటే నా బతుకు మీద, నేను జీవిస్తున్న ఈ జీవితం మీద విపరీతమైన అసహ్యం కల్గుతోంది"

అతడీ మాటలంటున్నప్పుడు బాధతో వణుకుతున్న అతని కంఠం అతనికి 'ఇది నా కంఠమేనా' అనిపించింది.

"ఔను... అసహ్యంగానే ఉంటుంది. నాకూ కల్గింది నా బతుకుమీద అసహ్యం. ప్రతిక్షణం నా గుండెల్ని గుండుసూదులతో పొడుస్తున్న మీ చర్యలు నన్నెంత హింసిస్తున్నాయో... ఎంత దహించి వేస్తున్నాయో... ఎప్పుడో యే మంటల్లోనో పడి నన్ను నేను భస్మం చేసుకుంటే తప్ప మీకూ, నాకూ శాంతి లేదు" అందామె భోరుమని యేడుస్తూ.

"కానీ నేను నిన్ను హింసించడం లేదు సుమిత్రా! యేదేదో ఊహించుకుంటూ నిన్ను నువ్వు హింసించుకుంటున్నావు... నువ్వు నామీద మోపుతున్న ఈ నిందల్లో ఏ ఒక్కటీ నిజంకాదు. నా అంతరాత్మ సాక్షిగా నేనీమాట చెబుతున్నాను. నామీద వేస్తున్న ఈ అభాండాలన్నీ నిరాధారమైనవని తెలిసినప్పుడు నిన్ను నువ్వు క్షమించుకోలేవు సుమిత్రా... ఆరోజు త్వరలోనే వస్తుంది. నీకై నువ్వు కొన్ని నిరాధారమైన, నిష్కారణమైన అనుమానాల్ని సృష్టించుకొని అనుభవిస్తున్న నీ ఈ మానసిక హింసకు నేను బాధ్యుణ్ణి కానని తెలిసినప్పుడు..."

"నిరాధారం, నిష్కారణం అంటూ నా నోరు మూయించే ప్రయత్నం చేస్తున్నారు. ఇవన్నీ ఎవరో చెప్తే విన్నవి కావు. నా కళ్ళతో నేను చూశాను. నాకళ్ళు నన్ను మోసం చెయ్యవు" అందామె రోషంగా, పట్టుదలగా.

"ఏమిటి నీకళ్ళు చూసింది.... ఎప్పుడో ఒకసారి పక్కింటి నీరజకేసి చూడటమా? ప్రపంచంలో ఏ మగవాడు ఏ ఆడదానివైపు కన్నెత్తి చూడటం లేదా? ఒకటి రెండు సార్లు ఎంతో సోషల్ మూవయ్యే నా పీ.ఏ. సునీతతో కలిసి కాఫీ తాగటం పెద్ద నేరమయిందా? పనిమనిషి బాలమ్మ మీద అప్పుడప్పుడు జోక్స్‌చేస్తూ నవ్వితే ఆమెతో సరసమాడినట్టా? కూరగాయలమ్మే కౌసల్యకు ఎప్పటిదో పాతబాకీ చెల్లిస్తే దాంట్లో కూడా నీకు బూతే కనిపించిందా? అర్థంపర్థంలేని కుంటి సాకుల్ని అడ్డం పెట్టుకొని ప్రతిక్షణం నీ మొండి సాధింపులతో, వెటకారాలతో, నిష్ఠూరాలతో

వేపుకుతింటూ నా గుండెల్ని శూలాల్లాంటి నీ మాటలతో గాయపరుస్తూ, నా నరనరాల్ని క్రూరంగా పిండి, పిప్పిచేస్తూ వినోదించటం నీకొక ఆటగా మారిపోయింది"

"ఔను... ఆటే అయిపోయింది. నాకళ్ళముందే మీరు మీకిష్టమైన ఆడవాళ్ళతో కులుకుతూ నన్ను యేడిపించటం మీకు ఆటకాలేదూ? కేవలం పక్కింటి నీరజకేసి చూడటమేనా? ఎక్కడో ఉంటున్న ఆ దంపతులకు మా పక్క పోర్షన్ ఖాళీ అయిందని చెప్పి ఆవిడ్ని ఇక్కడకు రప్పించి మీపక్కనే ఉండేటట్లు చేసుకున్నది మీరే కదా! మీ పక్క పోర్షన్‌లో ఎవరుంటే మీకేం? వాళ్ళనే పట్టుబట్టి బలవంతంగా తీసుకొచ్చి మీ పక్కపోర్షన్‌లో ఎందుకు ఉంచుకున్నట్టు? ఆ అమ్మాయికేసి చూసినప్పుడల్లా, ఆ అమ్మాయి మాటలు విన్నప్పుడల్లా మీరెందుకలా పరవశించిపోవాలి? ఆ అమ్మాయి కూడా మిమ్మల్ని దొంగచాటుగా చూస్తూ దొంగ సిగ్గుల్ని నటించాలి? ఇదంతా నాకళ్ళ ముందు జరిపించి, నన్ను ఉడికించి, వేధించి, కత్తుల బోనులో ఇరికించి, వినోదించాలనే కదా మీరు వాళ్లను పక్కపోర్షన్‌లో దిగబెట్టింది?"

"యూ డెవిల్! షటప్ యువర్ బ్లడీ మౌత్! నీ మాటలు వాళ్ళకినిపిస్తే వాళ్ళెంత బాధపడ్తారో నీకర్థమౌతున్నదా? రేపే వాళ్ళు ఆ పోర్షన్ ఖాళీ చేసి వెళ్ళిపోతారు. నీకు నిజంగా మతి చలించింది. నువ్వేం వాగుతున్నావో నీకు తెలియడం లేదు. ఆ పక్కపోర్షన్ వాళ్ళు మర్యాదస్తులు... సంస్కారవంతులు. గౌరవనీయుల కుటుంబానికి చెందినవాళ్ళు. నీ మాటలు వింటే మన నీచత్వం పట్ల వాళ్ళు ఉమ్మేస్తారు. హాయిగా కాపురం చేస్తున్న ఆ అమాయక దంపతుల అన్యోన్యతను చూసి, అలాంటి సుఖాన్ని నేను పొందలేకపోతున్నానన్న అక్కసులో వాళ్ళ పచ్చని కాపురంలో నిప్పులు పోయటానికి సిద్ధపడ్తున్నావు. ఇంత నైచ్యానికి దిగజారిన నిన్ను యేమీ చెయ్యలేకపోతున్న నా అసమర్థతపట్ల నాకు అసహ్యం వేస్తున్నది. ఈ బతుక్కంటే చావు నయం" అంటూనే అతడు తన తల బాదుకున్నాడు.

"ఔను... చావే నయం. నన్నేమీ చెయ్యలేకపోతున్నానని ఎందుకంత బాధపడిపోతున్నారు. నన్ను చంపెయ్యండి. నన్ను ముక్కలు చెక్కలుగా నరికి కాకులకు, గద్దలకు పంచండి. నా రక్తంతో మీ దాహాన్ని తీర్చుకోండి" అందామె తీవ్రంగా వణికిపోతూ.

"ఆపని చెయ్యాల్సిందే... కానీ నాలోని సభ్యతా సంస్కారాలు అడ్డొస్తున్నాయి" అన్నాడతడు ఆ గదిలోంచి బయటకు వెళ్ళటానికి ప్రయత్నిస్తూ.

కానీ అతనికామె అడ్డొచ్చి ఆపేసింది.

"మీరేమీ బాధపడొద్దు... నేనే మీ జీవితంలోంచి శాశ్వతంగా వెళ్ళిపోతున్నాను. మరోక్షణంలో ఈ రాక్షసి, ఈ పిశాచి ఈ ఇంట్లోనే కాలి బూడిదైపోతుంది" అంటూనే ఆమె వంటగదిలోకెళ్ళి గ్యాస్ సిలిండర్‌ను ఆన్‌చేసి లైటర్‌ను చేతిలోకి తీసుకుంది.

ఆమె చెయ్యబోతున్న పనేమిటో అతనికర్థమైంది. వెంటనే అతడు ఆమె మీదకు దూకి ఆమె చేతిలో ఉన్న లైటర్‌ను లాగేసి సిలండర్‌ను ఆఫ్ చేశాడు.

"నన్నాపకండి... నన్ను చావనీయండి. మీ పీడా విరగడైపోనీయండి. నేను చస్తేనే మీరు హాయిగా ఉండగల్గుతారు. నేను బతికున్నంత కాలం మీకు సుఖం లేదు... నాకూ సుఖం లేదు..." అందామె మరోసారి సిలిండర్‌ను ఆన్ చెయ్యడానికి ప్రయత్నిస్తూ.

అతడామెను తన శక్తినంతా కూడదీసుకొని ఆ వంట గదిలోంచి బెడ్‌రూంలోకి తీసుకొచ్చి బెడ్‌మీద పడుకోబెట్టాడు.

"నువ్వు గ్యాసు సిలిండర్ పేల్చితే ఇద్దరం కాలి బూడిదైపోతాం. నన్నుకూడా చంపాలని నీ ఉద్దేశ్యమా?"

"కాదు. నేనే చావాలి. మీరు బతకాలి. తను చచ్చైనా భర్తను బతికించుకోవడం భారతస్త్రీ ధర్మం... నేనెంత చెడ్డదాన్నైనా భర్తను చంపేటంత చెడ్డదాన్ని కాదండి" అందామె అతన్ని గట్టిగా కౌగలించుకొని భోరుమని యేడుస్తూ.

"అయితే జరిగిందంతా ఓ పీడకల అనుకొని నిశ్శబ్ధంగా పడుకో...." అన్నాడతడు ఆమెను ఓదార్చటానికి ప్రయత్నిస్తూ.

"నాకో నిద్రమాత్ర తెచ్చివ్వండి. అది వేసుకుంటే తప్ప నాకిప్పుడు నిద్రరాదు" అందామె బెడ్‌మీదకు వాలిపోతూ.

తనకస్సలు నిద్రపట్టదని, ఒకవేళ నిద్రపట్టినా పిచ్చి పిచ్చి కలలొస్తాయని సుమిత్రనొకసారి డాక్టర్ దగ్గరకు తీసికెళ్ళినప్పుడు చెబితే ఆ డాక్టర్ "ఈ టాబ్లెట్ ఒకటి మీరు పడుకునేముందు వేసుకోండని" అల్ప్రజొలామ్ టాబ్లెట్స్ రాసిచ్చాడు. కొన్నిసార్లు ఆ టాబ్లెట్ వేసుకున్నా సుమిత్రకు నిద్రపట్టేది కాదు. కాస్సేపు పడుకోగానే యేదో పీడకల వచ్చిందని వణికిపోతూ లేచి కూర్చునేది. 'యేమిటా కల?' అని అడిగితే ఎంతకూ చెప్పేది కాదు. అడగ్గా అడగ్గా ఒకసారి మాత్రం ఎవడో ఎక్కుపెట్టినట్టున్న గుబురు మీసాలవాడు తనకు కలల్లో పదేపదే కనిపిస్తున్నాడనీ, తననేదో చెయ్యాలని తనవెంట పడ్తున్నాడనీ, తను అతన్ని తప్పించుకొని పరిగెత్తుతోంటే అతడూ తనను వేటగాడిలా వేటాడుతున్నాడని చెప్పింది.

విద్యాసాగర్ వెళ్ళి ఆమెకు టాబ్లెట్ తెచ్చిస్తూ "కొంచెం తిని ఈ టాబ్లెట్ వేసుకో" అన్నాడు. "తినను. ఆకలిలేదు. మీకోసం వంటచేశాను. మీరు తినండి. ఒకదానితో నాకు నిద్రరాదు. రెండు టాబ్లెట్లు తెచ్చివ్వండి" అందామె అతనిచేతిలో ఉన్న టాబ్లెట్ తీసుకుంటూ.

"డాక్టర్ ఒక టాబ్లెట్ మాత్రమే వేసుకొమ్మన్నాడు" అన్నాడు సాగర్ ఆమె చేతికి మంచినీళ్ళ గ్లాసు అందిస్తూ...

"ఒక టాబ్లెట్ సరిపోదు. రెండివ్వండి. ఇదివరకు చాలాసార్లు మీకు తెలీకుండా రెండు టాబ్లెట్లు వేసుకున్నాను. యేమీ కాదు. నేను చచ్చిపోను. రెండు వేసుకోకపోతే పిచ్చిపిచ్చి కలలొస్తాయి. ఆ మీసాలవాడు మళ్ళీ నన్ను వేటాడ్తాడు" అందామె.

అతడు ఇంకో టాబ్లెట్ తెచ్చిచ్చాడు.

ఆ రెండు టాబ్లెట్లను మింగేసి ఆమె బెడ్‌మీదకు వాలిపోయింది. అరగంటలో ఆమె నిద్రలోకి జారుకుందని అతనికర్థమైంది.

ఈమెను అర్థం చేసుకోవడం నాకీజన్మలో సాధ్యం కాదు అనుకుంటూ అతడు వంటగదిలోకెళ్ళాడు. నాలుగు మెతుకులు తినేసి అతడు కూడా బెడ్‌రూంలోకొచ్చి ఆమె పక్కనే పడుకున్నాడు. చాలాసేపటి వరకు అతనికి నిద్ర రాలేదు.

## 2

ఆమర్నాడు విద్యాసాగర్ నిద్రలేచేటప్పటికే సుమిత్ర లేచి యథావిధిగా తన పనుల్ని చేసుకోసాగింది. అతడు బ్రష్ చేసుకోగానే కాఫీ తెచ్చిచ్చింది. అతడు కాస్సేపు ఆరోజటి న్యూస్ పేపర్ పేజీలు తిప్పేసి షేవ్ చేసుకోవడానికి డ్రెస్సింగ్ టేబిల్ దగ్గరకొచ్చాడు. షేవ్ చేసుకుంటూ పక్కపోర్షన్ వాళ్ళు రాత్రి సుమిత్ర అన్న మాటల్ని విన్నారేమో... వింటే ఈరోజు వాళ్ళా పోర్షన్ ఖాళీచేసి వేరే ఇంటికి వెళ్ళిపోతారేమో అని ఆలోచించాడు. కానీ వాళ్ళకు సుమిత్ర అన్నమాటలు వినిపించే అవకాశం లేదు. ఎందుకంటే వాళ్ళ బెడ్‌రూంలో వాళ్ళు ఏ.సీ. వేసుకొని, తలుపులూ, కిటికీలూ మూసేసి పడుకొని వాళ్ళ శృంగార స్వాప్నిక ప్రపంచంలోకెళ్ళిపోతారు... సుమిత్రకు కలల్లో మీసాలవాడు కనిపించడమేమిటో... పక్కింటి రవీందర్‌కు ఎక్కుపెట్టినట్టుండే గుబురైన మీసాలున్నాయి... కొంపదీసి సుమిత్రకు కలలో కనిపించే మీసాలవాడు ఈ రవీందరే కాదుగదా... ఒకసారి తమకు పెళ్ళైన కొత్తలో సుమిత్ర తనను "మీరు మీసాలెందుకు పెంచుకోరు?" అని అడిగింది. తనెప్పుడూ క్లీన్‌షేవ్ చేసుకుంటాడే తప్ప మీసాలు పెంచుకోడు.

"నీకు మీసాలంటే ఇష్టమా?" అని తను అడిగితే అలాంటిదేమీ లేదంది. ఇలా ఆలోచిస్తూ అతడు షేవ్ చేసుకోవడం పూర్తిచేసి బాత్‌రూంలోకెళ్ళి స్నానం చేశాడు. అతడు డ్రెస్ చేసుకొని ఆఫీసుకెళ్ళటానికి సిద్ధం కాగానే ఆమె "టిఫిన్ రెడీ" అంటూ డైనింగ్ టేబుల్‌మీద వేడివేడి ఇడ్లీలను ప్లేట్లో పెట్టింది. అతడు టిఫిన్ తినేసి గరాజ్‌లో ఉన్న కారును బయటకు తీసి "వెళ్ళొస్తాను సుమిత్రా!" అన్నాడు. "లంచ్‌కొస్తారా?" అని అడిగింది. "పనెక్కువ లేకపోతే వస్తాను. నీకు యే విషయం ఫోన్‌చేసి చెబుతాను" అన్నాడతడు కారును స్టార్ట్ చేసి.

ఐదంతస్తుల బిల్డింగ్‌లోని మూడో అంతస్తులో ఉంది అతని ఆఫీసు.

కారును ఆఫీసు సెల్లార్‌లో పార్క్‌చేసి అతడు తన రూంలోకెళ్ళిపోయాడు. ఆఫీసు స్టాఫ్‌లో చాలామంది అప్పుడప్పుడే వస్తూ తమతమ కేబిన్లలోకి వెళ్ళిపోతున్నారు.

అతనికా రోజు యేపనీ చెయ్యాలనిపించలేదు. ఎంత వద్దనుకున్నా అతడు సుమిత్రను గూర్చి ఆలోచించకుండా ఉండలేకపోతున్నాడు. ఆమె హాయిగా ఉంటూ తనను హాయిగా ఉంచటానికి ఆమెకు అన్ని హంగులూ ఉన్నాయి. అయినా యేదేదో ఊహించుకొని ఆమె జీవితాన్ని, తన జీవితాన్ని నరకప్రాయంగా మారుస్తున్నది. ఆమె ఎప్పటికైనా మామూలు మనిషిగా మారుతుందా?

"గుడ్‌మార్నింగ్ సాగర్!... యేమిటంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావు" అంటూ సాగర్ రూంలోకి అతని బెస్ట్‌ఫ్రెండ్ ప్రదీప్ ప్రవేశించాడు.

"హాయ్ ప్రదీప్! రారా! యేమిటిలా వచ్చావు... ఈరోజు మీ కాలేజి లేదా?"

"కాలేజిలో ఎప్పుడూ యేదో గొడవ ఉంటూనే ఉంటుంది. జూనియర్స్‌ని సీనియర్స్ ర్యాగింగ్ చేసి హింసించారని కంప్లెయింటిస్తే ప్రిన్సిపాల్ సీనియర్స్ మీద యాక్షన్ తీసుకోలేదని జూనియర్స్ ఈరోజు క్లాసెస్ బాయ్‌కాట్ చేశారు... యేదో గొడవ జరిగేట్టుందని ప్రిన్స్‌పాల్ ఈరోజు కాలేజికి సెలవు ప్రకటించేశాడు. ఇంటికెళ్తూ నిన్ను చూసివెళ్దామని ఇలా వచ్చాను... నువ్వేమిటిలా చాలా డిస్టర్బ్‌డ్‌గా కనిపిస్తున్నావు... మొఖమంతా పీక్కుపోయింది. రాత్రసలు నిద్రపోయావా?" అన్నాడు ప్రదీప్.

"రాత్రేకాదు... చాలా రాత్రుళ్ళు నేను నిద్రపోవడం లేదు... నా జీవితం చాలా మిజరబుల్‌గా మారిపోయిందిరా ప్రదీప్" అన్నాడు సాగర్.

"ప్రాబ్లెమ్ యేమిటి?"

"అన్నీ ప్రాబ్లెమ్సే... ఎన్నని చెప్పను?"

"ఎన్నైనా ఫరవాలేదు. చెప్పు... నాతో కాకపోతే ఎవరితో చెప్పుకుంటావురా... చెప్పు"

"మా ఆఫీసులో సునీత నా పీ.ఏ.గా పనిచేస్తూన్నదని నీకు తెలుసుకదరా..."

"అవును... సునీత ఈజ్ ఎ నైస్ గర్ల్... ఆమెను చూస్తేనే చాలు, నేను చాలా హాయిగా ఫీలౌతాను. నిజం చెప్పాలంటే ఇప్పుడు నేను మీ ఆఫీసుకు రావటానికి ఒక కారణం సునీతను కూడా ఒకసారి చూసిపోదామని..." అంటూ ప్రదీప్ నవ్వాడు.

"నీ జోక్‌ని ఎంజాయ్‌చేసే మూడ్ నాకిప్పుడు లేదు. ఈరోజు సునీత లీవ్ పెట్టింది. ఒక షాకింగ్ థింగ్ ఏమిటంటే... మా ఆఫీసువాళ్ళు నాకూ, సునీతకు సంబంధం అంటగట్టి నామీద ద్వేషం పెంచుకుంటున్నారు..."

"ఆశ్చర్యం లేదు... సునీత చాలా సోషల్‌గా మూవవుతుంది. పైగా అందగత్తె... నువ్వూ అందగాడివే... ఇదిచాలు, మీకిద్దరికి సంబంధం ఉందన్న ప్రచారం జరగటానికి..."

"వర్కింగ్ రిలేషన్‌షిప్ తప్ప మామధ్య ఎలాంటి సంబంధం లేదు. అయినా మా గురించి ఇలా చెప్పుకోవడం... మమ్మల్ని ద్వేషించటం... నిష్కారణంగా ఎదుటి వ్యక్తుల మీద వీళ్ళిలా ద్వేషాన్ని పెంచుకొని ఎందుకు తృప్తిపడ్తారో అర్థం కాదు"

"డీప్‌గా ఆలోచిస్తే అర్థమవుతుంది. తను చెయ్యాలనుకొని చెయ్యలేని పనుల్ని ఎదుటివాడు చేస్తే మనిషి భరించలేడు. ఆ పనులకి యేవేవో నైతిక విలువల్ని జోడించి విమర్శిస్తేగాని అతనికి నిద్రపట్టదు. చాలామంది మధ్యతరగతి కుటుంబీకులు యేనాడో సమాజం విధించిన కొన్ని నైతిక నిబంధనలకు బానిసలు.ఆ నిబంధనల్ని అతిక్రమించాలని వాళ్ళళ్ళో వాళ్ళకు తెలీని నిగూఢశక్తొకటి పనిచేస్తుంటుంది. సమాజానికి భయపడి తమలోని కొన్ని కోరికల్ని తమలోనే అణిచేసుకొని కొన్ని అసహజమైన మార్గాలద్వారా ఆ కోరికల్ని తీర్చుకోవాలని ప్రయత్నిస్తారు" అన్నాడు ప్రదీప్.

"నువ్వో సైకాలజీ లెక్చరర్‌వి కాబట్టి ఇలా మాట్లాడుతున్నావేమోరా... కానీ నువ్వు చెబుతున్నది నాకర్థం కావడం లేదు" అన్నాడు సాగర్.

"అర్థం అవుతుంది. ఇప్పటి మీ సునీత ఉదాహరణే తీసుకో... సునీతకు, నీకూ యేదో అక్రమ సంబంధం ఉందనే పుకారు పుట్టిస్తున్నారు మీ ఆఫీసులో కొందరు. అందుక్కారణమేమిటంటే, చాలామంది స్త్రీ పురుషులు తమ భర్తలతో భార్యలతోటే కాకుండా ఇతర్లతో కూడా సంబంధాన్ని వాంఛిస్తారు. సభ్యసమాజం దీన్ని అంగీకరించదు కాబట్టి ఆ వాంఛను, ఎవరో కొందరు తప్ప, తృప్తిపరచుకోక తమలోనే అణచేసుకుంటారు. అయితే ఎవరో ఒక పురుషుడు పరాయి స్త్రీతో సంబంధం పెట్టుకున్నాడని యేకొంచెం అనుమానం కల్గినా దాన్ని గోరంతల్ని కొండంతలు చేసి

ప్రచారం చేస్తారు. ఎందుకంటే తాము చెయ్యాలనుకొని చెయ్యలేకపోయిన పనిని వీడు చేస్తూ, తాము పొందలేకపోయిన ఆనందాన్ని వీడు పొందుతున్నాడనే అసూయ ద్వేషంగా మారుతుంది. అక్రమ సంబంధం పెట్టుకుంటున్నవాళ్ళంతా అవినీతిపరులనీ, తాము మాత్రం నీతిమంతులమని తమను తాము నమ్మించుకొని తృప్తిపడ్తారు. ఇంతకూ నేను చెప్పొచ్చేదేమిటంటే ఎవడైనా వేరొకరు చేస్తున్న పనిని అతిగా దూషించటమో, ద్వేషించటమో చేస్తున్నాడంటే అలాంటి పనినే అతనికి చెయ్యాలని అతని అంతరాంతరాల్లో – ఫ్రాయిడ్ మాటల్లో చెప్పాలంటే అతని అన్‌కాన్షియస్‌లో – అంటే అంతశ్చేతనలో ఉందని మనం అర్థం చేసుకోవాలి" అన్నాడు ప్రదీప్.

"సీరియస్‌గా ఆలోచిస్తే నువ్వు చెప్పేది నిజమే అనిపిస్తోంది. నువ్వు చెప్పేది వింటోంటే నీకు మరో విషయం చెప్పాలనిపిస్తోంది. ఈమధ్య నాకూ మా ఆవిడకు మధ్య రోజూ యేదో ఒక రాద్ధాంతం జరుగుతోంది. మా ఇల్లు నరకప్రాయమై పోయిందనుకో..." అన్నాడు సాగర్.

"యే విషయం గురించి ఆ రాద్ధాంతం?"

"పెళ్ళి చేసుకున్న మొదట్లో మేం బాగానే ఉండేవాళ్ళం. కానీ ఈమధ్యనే మా ఆవిడకు నామీద ఒక భయంకరమైన అనుమానం ప్రారంభమైంది. నాకు ప్రపంచంలో ఉన్న స్త్రీలందరితోనూ అక్రమ సంబంధం ఉందని, నాకు నీతినియమాలనేవి లేవని ప్రతిరోజు నన్ను సాధించి, చంపుకు తింటోంది"

"చాలా ఆశ్చర్యంగా ఉందే... ఎవరెవరితో సంబంధం ఉంటుందంటుంది. ఎలాంటి ఆధారాలు ఆమెకా అనుమానాన్ని కల్గిస్తున్నాయి"

"ఎవరితోనేమిటి? నేను యే స్త్రీతో మాట్లాడినా, యే స్త్రీ వైపు కన్నెత్తి చూసినా నాకు వాళ్ళతో సంబంధాన్ని అంటగడ్తున్నది"

"నీ పీ.ఏ. సునీతతో కూడా సంబంధం అంటగడ్తున్నదా?'

"అందుకు సందేహమా? మా ఆఫీసులో ప్రారంభమైన పుకార్లు మా ఇంటిదాకా వెళ్ళాయి. ఎప్పుడో ఒకసారి సునీత తన స్కూటర్‌మీద మా వీధిలోంచి వెళ్తోంటే నేనే పిల్చాను. కాస్సేపు ఇద్దరం నవ్వుతూ మాట్లాడుకున్నాం. నీకు సునీత సంగతి తెలుసుగా... ఎప్పుడూ తను నవ్వుతూ ఎదుటివాళ్ళను కూడా నవ్విస్తూ ఉంటుంది. మేమిద్దరం మాట్లాడుకుంటున్నప్పుడు సుమిత్ర కూడా అక్కడే ఉంది. సునీత సుమిత్రతో కూడా మాట్లాడబోయింది. ఆమెను కూడా నవ్వించాలని ప్రయత్నించింది. కానీ సుమిత్ర బిగుసుకుపోయింది. నవ్వలేదు సరికదా మమ్మల్నిద్దర్నీ తినేసేలా చూసింది. సునీత వెళ్ళిపోగానే "నాతో ఎప్పుడైనా అలా నవ్వుతూ

మాట్లాడారా? మీరు దాన్ని ప్రేమిస్తున్నార”ని పెద్ద గాలిదుమారాన్ని సృష్టించింది. అలాగే ఆవిడగారు మరో విషయంలో కూడా పెద్ద సీన్ క్రియేట్ చేసింది. మా ఇంట్లో పక్కపోర్షన్ ఖాళీ అయితే నాకు తెలిసిన రవీందర్ అనే ఒక ఫ్రెండ్‌కు చెప్పాను. అతడు నాకే ఆ పోర్షన్ కావాలని సతీసమేతంగా వచ్చి ఆ పోర్షన్‌లో దిగాడు. అతడు మూడు నెలల క్రితమే పెళ్ళి చేసుకున్నాడు. అతని భార్య పేరు నీరజ. చాలా అందంగా, కలుపుగోలుగా ఉంటుంది. వాళ్ళిద్దరి జంట కూడా చూడముచ్చటగా ఉంటుంది. నీరజతో నేను అప్పుడప్పుడు నవ్వుతూ మాట్లాడాను. అంతే! నాకూ నీరజకు సంబంధం అంటగట్టేసింది. వాళ్ళకు వినిపించేట్టుగా కూడా ఒకటి రెండుసార్లు వాగేసింది. ఎంతో అన్యోన్యంగా ఉంటున్న ఆ దంపతుల మధ్య చిచ్చుపెట్టడానికి ప్రయత్నించిన సుమిత్రను నేను క్షమించలేకపోతున్నాను. తన ఈ అనుమానాలన్నీ నిరాధారమైనవనీ ఆమెక్కూడా తెలుసు. అయినా ఆమె ఎందుకలా ఆ అభాండాల్ని నామీద పదేపదే వేస్తుంటుందో నాకర్థం కావడం లేదురా!”

“ఆమె ఇలా ప్రవర్తించడం ఎప్పట్నించి? మొదట్లో బాగానే ఉండేవాళ్ళం అన్నావు కదా”

“అవును... ఈమధ్యనే ఆమె ఇలా ప్రవర్తిస్తోంది. నాకు స్పష్టంగా జ్ఞాపకం... మా పక్కపోర్షన్‌లో రవీందర్ దంపతులు దిగినప్పట్నించే మా ఆవిడలో ఈ అనుమానమనే భూతం ప్రవేశించింది. వాళ్ళు మా ఇంట్లో దిగాకే సునీత ఒకసారి మా ఇంటికొచ్చింది... వెంటనే నాకు సునీతతో సంబంధం అంటగట్టింది. ఆతర్వాత మా ఇంట్లో పనిచేసే పనిమనిషి బాలమ్మతో కూడా సంబంధం ఉందంటోంది. అలాగే మా ఇంటికి కూరగాయలు తెచ్చే ముగ్గురు పిల్లల తల్లి కౌసల్యతో కూడా నాకు సంబంధం ఉందంటోంది”

“ఇదొక మానసిక జాడ్యంరా సాగర్... నాకో విషయం చెప్పు... మీరు మొదట్లో కాపురం పెట్టినప్పుడు మీ ఆవిడలో ఇలాంటి అనుమానాలసలుండేవికావా? మొదట్లో ఆమె ఇష్టాయిష్టాలెలా ఉండేవి?”

“మొదట్నించీ సుమిత్ర కొంచెం అనుమానం మనిషే... ఓపెన్‌గా ఉండేది కాదు... చాలా రిజర్వ్‌డ్‌గా ఉండేది. మనం సరదాగా యేదన్నా అంటే దానికి విపరీతార్థాలు తీసేది. నేనోసారి బాపు బొమ్మలా సన్నగా ఉండేవాళ్ళంటే నాకిష్టం అని క్యాజువల్‌గా అంటే “అయితే నేనంటే మీకిష్టం లేదు. అవునా?” అంది. ఎందుకలా అనుకుంటున్నావంటే “మీకు సన్నటివాళ్ళంటే ఇష్టం కదా! నేను కొంచెం లావుగా ఉంటానుకదా” అంది. “నువ్వు మరీలావేం కాదు... నువ్వంటే నాకు చాలా ఇష్టం”

అన్నాను. "నా తృప్తికోసం అలా అంటున్నారేండి" అంది. నీకిదంతా చెబుతోంటే నాకు మరో విషయం గుర్తొస్తోంది"

"యేమిటది?"

"ఇందాక నువ్వన్న మాటలోని నిజం నాకిప్పుడు అర్థమవుతున్నది. మనం దేన్నైనా అతిగా ద్వేషిస్తున్నామంటే దాన్ని మనం మనకు తెలియకుండానే వాంఛిస్తున్నామన్నమాట. ఇంతకాలం బుర్ర బద్దలుకొట్టుకున్నా అర్థంకాని సుమిత్ర అసహజ ప్రవర్తన ఇప్పుడర్థమౌతున్నది"

"ఏమిటి నీకర్థమయింది"

"సుమిత్రకు మా పక్కపోర్షన్‌లో ఉండే రవీందర్ మీద ఇష్టం కల్గింది. అతనిమీద ఇష్టం కల్గిందని బయటకు చెప్పటం ఆమెకు సాధ్యమయ్యే పనికాదు... నువ్వన్నట్టు ఆ ఇష్టాన్నామె తన అన్‌కాన్షియస్‌లోకి నెట్టేసింది. తనకలాంటి కోరిక కల్గినందుకు ఆమె తనను తాను ద్వేషించుకుంటున్నది. ఆ ద్వేషాన్ని నామీదకు మళ్ళించి తృప్తిపడుతున్నది... దట్సిట్... నాకు తెలియకుండానే ఒకటిరెండు సార్లు ఆమెతో "నిన్ను నువ్వే ద్వేషించుకుంటూ, నిన్ను నువ్వే హింసించుకుంటూ మరెవరో నిన్ను హింసిస్తున్నారను కుంటున్నావ"ని అన్నాను"

"నీ ఎనాలసిస్ బాగానే ఉంది. కానీ ఆమె రవీందర్‌ను ఇష్టపడుతున్నదని అనడానికి యేమిటి ఆధారం"

"బలమైన ఆధారమే ఉంది. మా పెళ్ళైన కొత్తలో రెండుమూడు సార్లు ఆమె నాతో మీరు మీసాలెందుకు పెంచుకోరు... ఇలా పేడిమూతితో ఎందుకుంటారు అని అడిగింది. నీకు మీసాలంటే ఇష్టమా? అని అడిగాను. కాదని అబద్ధం చెప్పింది. మా పక్కింట్లో దిగిన రవీందర్ రూపంలో కొట్టవచ్చినట్టు కనిపించే ఒక విశేషమేమిటంటే నల్లగా నిగనిగలాడ్తూ ఎక్కుపెట్టినట్టుండే అతని మీసాలు. ఆ మీసాల వల్లనే రవీందర్ మొఖానికొక విచిత్రమైన ఆకర్షణ యేర్పడింది. అలా అతడు మా సుమిత్రను ఆకర్షించాడు. అతని మీద ఆకర్షణే కాదు... కోరిక కూడా యేర్పడింది. కానీ తనలో అలాంటి కోరిక కల్గినందుకు తనను తాను అసహ్యించుకుంది. ఈమధ్య తననెప్పుడూ ఒక పీడకల భయపెడ్తున్నదని చెప్తోంది"

"యేమిటా కల?"

"ఆమెకసలు నిద్రేపట్టదు. ఎప్పుడైనా కాస్సేపు నిద్రపోతే చాలు... ఎవడో ఎక్కుపెట్టినట్టున్న గుబురు మీసాలున్నవాడు ఆమెమీద పడ్తున్నట్టుగా, తను అతన్ని తప్పించుకొని పారిపోతోంటే వాడు తనను వేటాడుతున్నట్టుగా కలలొస్తున్నాయట..."

ప్రదీప్ కాస్సేపు ఆలోచిస్తూ ఉండిపోయాడు.

"నువ్వు చెప్పిందంతా వింటోంటే నీ విశ్లేషణ కరెక్టే అనిపిస్తోంది... కానీ సాగర్... నీకో విషయం చెప్పాలి. మీ ఆవిడకు పరపురుషుడి మీద కోరిక కల్గిందనో, ఇష్టం కల్గిందనో నువ్వామెను ద్వేషించకూడదు. ఇదంతా ఆమెకు తెలియకుండానే జరుగుతున్నది... మెల్లిగా, శాంతంగా ఆమెలో యేం జరుగుతున్నదో ఆమెకు తెలిసేలా చెయ్యాలి... అప్పుడే ఆమె సమస్య, తద్వారా నీ సమస్య పరిష్కారమౌతాయి"

"అదెలా జరుగుతుందంటావు?"

"ఒక మంచి సైకో-ఎనలిస్టు సహాయం తీసుకుంటే బావుంటుందేమోరా!"

"ఈ ఊర్లో సైకోఎనలిస్టు ఎవరున్నారు... ఒకసారి సైకియాట్రిస్టు దగ్గరకు వెళ్దామంటే నాకేమన్న పిచ్చెక్కిందనుకుంటున్నారా అని పెద్ద గొడవ చేసింది"

"చాలా శాంతంగా నువ్వే ఈ సమస్యను పరిష్కరించుకోవాలి... ఆమెకు పరపురుషుడి మీద కోరిక కల్గిందనుకొని నువ్వామెను శిక్షించటానికి ప్రయత్నించకూడదు. అదసలు శిక్షించాల్సిన నేరమే కాదు. ఎందుకంటే మనలో మనకు తెలియకుండా మన అధోలోకంలో సంచరిస్తున్న కొన్ని శక్తుల్ని అదుపులో పెట్టుకోలేం. ఒక పురుషుడికి పరస్త్రీమీద కోరిక కల్గటం ఎంత సహజమో ఒక స్త్రీకి పరాయి పురుషుడి మీద కోరిక కల్గటం కూడా అంతే సహజం... నీకు తెలియకుండానే నీలో సునీతమీద కోరిక ఉందేమోనని నా అనుమానం... నువ్వు పురుషుడివి కాబట్టి అలాంటి కోరిక నీలో ఉన్నా అదేదో తప్పని భావించి నిన్ను నువ్వు శిక్షించుకోవు. కానీ స్త్రీ విషయంలో అలా జరగదు. ప్రతి భారతస్త్రీ నేనొక పతివ్రతననే అనుకుంటుంది. అలాంటప్పుడు ఆమెకు మరో పురుషుడి మీద కోరిక కల్గిందన్న వాస్తవాన్ని అస్సలు అంగీకరించదు. అలాంటి కోరికను తన అంతరంగంలో అణిచేసుకొని తనను తను శిక్షించుకునే ప్రయత్నం చేస్తుంది. తనమీద తనకు కల్గిన ద్వేషాన్ని వేరొకరి మీదకు ట్రాన్స్ఫర్‌చేసి తృప్తిపడటానికి ప్రయత్నిస్తుంది"

"నువ్వు చెప్పింది బాగానే ఉంది. ఆమెను శిక్షించకూడదన్న నీ అభిప్రాయంతో నేను ఏకీభవిస్తాను... కానీ ఆమెను మళ్ళీ ఒక నార్మల్ మనిషిగా మార్చాలంటే యేం చెయ్యాలంటావు?"

"ఆమెలో ఇలాంటి మానసిక వికారం జనించినట్టు ఆమెకు అర్థమయ్యేలా చెయ్యాలి. ఒక మధ్యతరగతి భారతస్త్రీ తనలో ఇలాంటి కోరిక కల్గిందని అస్సలొప్పుకోదు. కానీ మనం జాగ్రత్తగా ఆమెకు ఒకస్త్రీలో ఇలాంటి వికారం కల్గటం దోషం గానీ, నీచం గానీ, గర్హనీయం కానీ కాదని, అదొక అత్యంత సహజమైన

మానసిక వికారమని ఆమెను ఒప్పించగల్గితే ఆవిడ తనలోని తనను తెలుసుకొని తనతోతను సమాధానపడి తనను తాను స్వీకరిస్తుంది. అలా జరిగినప్పుడు ఆమెలో ఉద్భవించిన ఆ మానసిక సంఘర్షణ అంతమౌతుంది"

"థాంక్యూ ప్రదీప్! ఈరోజు నీతో మాట్లాడటం నాకు గొప్ప కనువిప్పును కల్గించింది. నేను సుమిత్రపట్ల సాధ్యమైనంత సానుభూతితో, ప్రేమతో ప్రవర్తించి ఆమెను మార్చటానికి ప్రయత్నిస్తాను"

"కానీ నువ్వు సహనాన్ని ఎప్పుడూ కోల్పోకూడదు. అకస్మాత్తుగా నువ్వామెతో నీకో పరపురుషుడి మీద ఇష్టం కల్గిందని అన్నావనుకో, ఆవిడలోని తను పతివ్రతనన్న భావం ఘోరంగా దెబ్బతింటుంది. అలా నైతికంగా దెబ్బతిన్న స్త్రీలు ఎంతటి సాహసానికైనా ఒడిగడ్తారు... ప్రేమతో, సహనంతో, క్షమతో తప్ప నువ్వామెను మరోలా మార్చలేవు"

"అలాగేరా ప్రదీప్... ఐవిల్ నెవర్ లూజ్ మై కూల్... ఓ.కే" అన్నాడు సాగర్.

"ఓ.కేరా... ఆల్‌ది బెస్ట్... త్వరలోనే మీ కాపురం చక్కబడ్తుందని ఆశిస్తున్నాను" అంటూ ప్రదీప్ తన సీట్లోంచి లేచి బయటకు వెళ్ళిపోయాడు. సాగర్ ప్రదీప్ వెళ్ళిన వైపే చూస్తూ దీర్ఘంగా నిట్టూర్చాడు.

## 3

సాయంత్రం యేడవుతుండగా విద్యాసాగర్ తనింటి పోర్టికో కింద కారును పార్క్ చేసి ఇంట్లోకొచ్చాడు. డ్రాయింగ్ రూంలోనే కూర్చొని టీ.వీ చూస్తున్న సుమిత్ర అతన్ని చూడగానే

"ఈరోజు చాలా త్వరగానే ఇంటికొచ్చారే!" అంది. ఆమె కంఠంలో ధ్వనించిన వెటకారాన్ని అతడు పట్టించుకోకూడదను కున్నాడు.

"రాకూడదా సుమిత్రా! సరేగాని అలా కాస్సేపు వెంగళరావు పార్క్ దాకా వెళ్ళి కాస్సేపు కూర్చొనొద్దాం పద!" అన్నాడతడు సాధ్యమైనంత అనునయంగా

"ఈ దీనురాలిమీద అకస్మాత్తుగా ఇంత దయ కల్గిందెందుకో... మీ పక్కన పబ్లిక్‌పార్క్‌లో కూర్చొనేటంత అర్హత నాకుందా?.. యే సునీతలాంటి వాళ్ళకో ఉంటుంది గానీ... ఈరోజు మీ సునీత ఆఫీసుకు రాలేదా యేమిటి?"

"ఎందుకు సుమిత్రా! ఎప్పుడూ అలా నిష్ఠూరంగా మాట్లాడతావు? మామూలుగా మాట్లాడలేవా?"

"నిష్ఠూరమేం లేదు. నేనడిగిందానికి సమాధానం చెప్పండి"

"యేమిటి నువ్వడిగింది?"

"ఈరోజు సునీత మీ ఆఫీసుకు రాలేదా?"

"సునీత విషయం మరచిపో... ఆమెకు నాకూ మధ్య ఆఫీసుకు సంబంధించిన విషయాల్లో తప్ప మరేరకమైన సంబంధం లేదు... దాన్ని నీ మనసులోంచి తీసేసి హాయిగా ఉండు... పార్క్‌కు వెళ్దాం పద... ఎప్పుడూ ఇంట్లో నాలుగ్గోడల మధ్య కూర్చుంటే మన బుర్ర అనవసరమైనవి ఊహించుకొని బాధపడ్తుంది... కమాన్... త్వరగా తయారవ్వాలి. ఈలోగా నేను ఫ్రెషప్పవుతాను"

"అంటే నేనెప్పుడూ ఈ నాలుగ్గోడల మధ్య కూర్చొని అనవసరమైనవన్నీ ఊహించుకుంటున్నాననా మీ ఉద్దేశ్యం. ఇప్పుడు మిమ్మల్ని నేనేమన్నానని నన్నిలాంటి మాటలతో వేధిస్తారు"

"నేను జనరల్‌గా అన్నాను... నిన్ననలేదు. నువ్వలా అనుకుంటే సారీ! నన్ను క్షమించు. వెంటనే తయారవ్వు"

"భర్తను భార్య క్షమించటమేమిటి? లోకంలో ఎక్కడైనా ఉందా? ఈ పిచ్చిదాన్ని మీ అంతటి గొప్పవాళ్ళు క్షమించమని అడగటమేమిటి? నన్ను అవమానించటానికి కాకపోతే..."

"ఓ మైగాడ్! సారీ అనడం కూడా తప్పేనన్నమాట... పోనీయ్‌లే సుమిత్రా... మనం ఇప్పుడు పార్క్‌కు వెళ్తున్నామా? లేదా?"

"నేనిప్పుడుడెక్కడికీ రాను. నన్నీ నాల్గుగోడల మధ్యనే ఉండనీయండి"

"అలా అనొద్దు... ప్లీజ్... పోనీయ్ సెకండ్‌షో సినిమాకెళ్దామా. నిన్న రవీందర్, నీరజ ఎంత చక్కగా సినిమాకెళ్ళొచ్చారో చూశావుగా..."

"ఔను... వాళ్ళేం చేసినా మీకు చక్కగానే ఉంటుంది. ఇష్టమున్నప్పుడు అన్నీ చక్కగానే ఉంటాయి. ఇష్టం లేనప్పుడు ప్రతీదీ అసహ్యంగానే కనిపిస్తుంది"

"నువ్వంటే ఇష్టం లేదని ఇప్పుడెవరన్నారు"

"వేరే అనాలా?"

"అదిపోనీయ్... సినిమాకు కాకపోతే మరెక్కడికెళ్దామో చెప్పు... నీకిష్టమైన చోటికి తీసికెళ్తాను"

"ఇంతకాలానికి అడుగుతున్నారు నా ఇష్టాయిష్టాలని..."

"ఇదివరకూడా అడిగాను... నువ్వే మరచిపోయావు... ఎక్కడికని కాకుండా ఊరికేనే అలా కాస్సేపు కార్లో తిరిగొద్దాం...తయారవ్వు. పెళ్ళినాటి ఆ బ్లూ పట్టుచీరె కట్టుకో... రంభలా ఉంటావు"

"ఎందుకండీ అంత తెచ్చిపెట్టుకున్న ఉత్సాహాన్ని కనబరుస్తారు. మీకంటికి రంభలా కనిపించేవాళ్ళెవరో నాకు తెలీదనుకుంటున్నారా?"

"నా కంటికి రంభలా కనిపించే స్త్రీ ఈ ప్రపంచంలో ఒకే ఒకరు... అది నువ్వే సుమిత్రా... ప్లీజ్ బిలీవ్‌మీ... ప్రతిక్షణం నన్ను శంకించకు... సెకండ్‌షో సినిమాక్కూడా టైమవుతున్నది... బయటెక్కడైనా కొంచెం తినేసి సినిమా చూసొద్దాం... కమాన్ సుమిత్రా.. తయారవ్వు"

"ఈరోజు చాలా ఉత్సాహాన్ని చూపిస్తున్నారు... ఆ సినిమాకు మీ సునీత వస్తానందా?"

"ఛీ! ఎంత సహనాన్ని, ఎంత ప్రేమను చూపించినా నీ ధోరణి మారదన్నమాట"

"ఎందుకంతగా మీలో నిజంగా లేని ప్రేమను, సహనాన్ని తెచ్చిపెట్టుకుంటారు?"

"ఎందుకా? బుద్ధి గడ్డితిని... నువ్వొక హృదయం ఉన్న మనిషివి అనుకొని"

అతనిలోని సహనం క్రమక్రమంగా నశిస్తోందని అతనికర్థమవుతూనే ఉంది. ఆమెతో ఇక మాట్లాడటం మానేస్తే మంచిదేమో అనుకున్నాడు.

"చెప్పానుగా... నేను మనిషినే కానని... అలాంటి దానికి హృదయమెక్కడుంటుందండీ! నేనో రాక్షసిని, భూతాన్ని, దయ్యాన్ని.. ఎప్పుడో అప్పుడు ఈ రాక్షసి గొంతు నులిమేసి మీ సునీతలతో, నీరజలతో మీ ఇష్టమొచ్చినట్టుగా కులకండని మీకెప్పుడో చెప్పాను"

"పిచ్చిపిచ్చిగా వాగకు... సునీత, నీరజలు చాలా గౌరవనీయమైన కుంటుంబాలకు చెందినవాళ్ళు. వాళ్ళను గురించి ఇలా మరోసారి వాగావంటే మర్యాదక్కదు"

"చేస్తే మర్యాద దక్కుతుందిగానీ అంటేనే దక్కదేమో... ఆడదాన్ని కాబట్టి మీరేం చేసినా నోరు మూసుకొని పడుండాలి..."

అతడు తనను తాను మరచిపోయాడు. అతనికి తెలియకుండానే అతనిలో ఆవేశం కట్టలు తెంచుకొని ప్రవహించింది.

"సుమిత్రా... సుమిత్రా... నువ్విలా ప్రతిక్షణం నన్నెందుకు సాధిస్తున్నావో... ప్రతిక్షణం ఎందుకు నా గుండెల్ని కోసేస్తున్నావో నాకు తెలిసింది. ప్రపంచంలో ఉన్న ప్రతిస్త్రీతో నాకు అక్రమ సంబంధం ఉందని నువ్వెందుకు ఊహించుకుంటూ నిన్ను నువ్వు, నన్నూ ఎందుకు చిత్రవధ చేస్తున్నావో నాకీరోజు తెలిసిపోయింది"

"యేం తెలిసింది మీకు... చెప్పండి... చెప్పండి..."

అతనికి ప్రదీప్ చెప్పిన మాట గుర్తొచ్చింది. అతనికి తెలిసిందేమిటో ఆమెకు చెబితే ఆమె ఎంత వయలెంట్‌గా రియాక్టవుతుందో అతడు ఊహించగల్గాడు.

"చెప్పటానికేం లేదు... ఈ గొడవను ఇంతటితో ఆపేద్దాం... దయచేసి నాకింత అన్నం పెడ్తావా? తిని పడుకుంటాను"

"అన్నం పెడ్తాను... కానీ మీకు తెలిసిందేమిటో చెప్పాలి..." అందామె తీవ్రమైన పట్టుదలతో.

ఆమెలోని ఆ పట్టుదలను చూస్తే అతనికి ఆశ్చర్యం కల్గింది.

"చెప్పటానికేం లేదన్నాను. యేదో నోరుజారాను... సారీ... యేమీలేదు. ఇట్స్ నథింగ్... ఇంతటితో దాన్ని వదిలేద్దాం... ప్లీజ్"

"లేదు... వదిలేయవద్దు... మీ మైండ్‌లో యేముందో చెప్పకపోతే నేనిప్పుడే చచ్చిపోతాను... చెప్పాలి... చెప్పి తీరాలి..."

యేమిటిది? ఆమె ఎందుకంతగా పట్టుబడ్తోంది? తనను గురించిన నిజమేదో, తనెక్కడో తన హృదయాంతరాళంలో దాచిపెట్టుకున్న నిజమేదో అతనికి తెలిసిపోయిందని, తను దాచిపెట్టుకున్న నిజం అతనికి నిజంగా తెలిసిందో లేదో తెలుసుకోవాలన్న పట్టుదల కావచ్చది.

"నాకు తెలిసిందేమిటో చెబితే నువ్వు భరించలేవు సుమిత్రా... ప్రస్తుతానికి వదిలెయ్.. మరోసారెప్పుడైనా నువ్వు ప్రశాంతంగా ఉన్నప్పుడు చెబుతాను..."

"లేదు... ఇప్పుడే... ఈ క్షణమే చెప్పాలి. చెప్పకపోతే నాతలను ఈ గోడకేసి బాదుకొని చచ్చిపోతాను... చెప్పండి... నేను బతికుండాలని మీకు యే కోశాన ఉన్నా మీకు తెలిసిందేమిటో ఇప్పుడే చెప్పండి. మీకాళ్ళు పట్టుకుంటాను" అందామె అతనిదగ్గరకొచ్చి అతని కాళ్ళు పట్టుకొని.

ఆమెను చూస్తోంటే అతనికి భయమేసింది.

తనకు తెలిసిందేమిటో ఈమెకు ఇప్పుడు చెప్పినా చస్తుంది. చెప్పకపోయినా చస్తుంది. తనిప్పుడేం చెయ్యాలి. 'క్యాచ్ 22' సిట్యుయేషన్‌లో పడిపోయాడు...

అతనిలో ఒక తెగింపు వచ్చేసింది. ఇంతదాకా వచ్చాక ఇక వెనక్కి వెళ్ళే పరిస్థితిలేదు.

"నువ్విలా అనుక్షణం నన్ను ఎందుకనుమానిస్తున్నావో చెబుతాను... ప్రశాంతంగా విను... నువ్వేదో తప్పుచేశాననటం లేదు... నీలో నీకు తెలియకుండానే ఒక కోరిక జనించింది. ఆ కోరిక నీలో కల్గినందుకు నిన్ను నువ్వు అసహ్యించుకుంటూ,

నిన్ను నువ్వు ద్వేషించుకుంటూ, నిన్ను నువ్వు అనుమానించుకుంటూ వాటిని నామీదకు బదిలీ చేస్తున్నావు..."

"అంటే... అంటే... నాకర్థమయ్యేట్లు చెప్పండి... నాలో కోరిక కల్గిందా? యేమిటా కోరిక... చెప్పండి... త్వరగా చెప్పండి"

"చెబుతాను... చెప్పాక పిచ్చి ఆవేశానికి లోనుకాకు. నువ్వేదో తప్పు చేశావనటం లేదు... మనకు తెలియకుండా మనలోపలి ప్రపంచంలో యేవేవో కోరికలు దాగి ఉంటాయి... నీలోనే కాదు, అందరిలోను అలా జరుగుతుంది..."

"యేమిటా కోరిక... త్వరగా చెప్పండి..."

అతడు కాస్సేపు ఆగాడు.

"చెప్పండి ప్లీజ్" అంటూ అరిచిందామె.

చెప్పకపోతే ఈ రాత్రంతా తననిలాగే వేధిస్తుందని అతనికర్థమైంది.

"నీకు మన పక్కింటి రవీందర్ మీద నీకు తెలియకుండానే కోరిక పుట్టింది. అలాంటి కోరిక నీలో కల్గినందుకు నిన్ను నువ్వు ద్వేషించుకుంటూ, నిన్ను నువ్వు హింసించుకుంటూ, నీలోని ఆ కోరికను నా మీదకు బదిలీ చేసి తృప్తిపడ్తూ..."

"యేమంటున్నారు మీరు? నాకు రవీందర్ మీద కోరిక పుట్టిందా? అంటే నేనో కులటననా మీ అభిప్రాయం? నామీద మీకలాంటి అభిప్రాయం కల్గినందుకు ఈ క్షణమే నా తల వెయ్యి వక్కలై పగిలిపోవాలి... నా శరీరం అగ్నికి ఆహుతై బూడిదగా మారిపోవాలి... ఇప్పుడదే జరుగుతుంది" అంటూనే ఆమె వంటదిలోకి పరిగెత్తింది. ఓ టిన్‌లో ఉన్న కిర్సనాయిల్‌ని తనమీద కుమ్మరించుకుంది. అతడు ఆమె వెంటే పరిగెత్తబోయి దార్లో ఉన్న స్టూలుపీట తాకి కింద పడిపోయాడు.

"ఎప్పుడో అప్పుడు నాకీ కిర్సనాయిల్‌తో అవసరం పడ్తుందని నిన్ననే ఈ టిన్‌లో కిర్సనాయిల్ తెచ్చుకున్నాను..." అంటూనే ఆమె అగ్గిపుల్ల గీసి అంటించుకుంది. గుప్పుమని మంటలు ఎగిసిపడ్డాయి...

అతడు "సుమిత్రా!" అని అరుస్తూనే ఉన్నాడు. కిందపడిపోయిన అతడు పైకి లేవలేకపోయాడు. మంటల్లో పడి కాలిపోతున్న ఆమెను అతడు నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయాడు.

– సండే ఇండియన్ (డిసెంబర్, 2009)